నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 21 అక్టోబర్ 2024 | HYDERABAD

ఇబ్రహీంపట్నం బీఆర్ఎస్ కార్యకర్తల దసరా సమ్మేళనం ఆదివారం ఆదిబట్ల లోని ప్రమీద గార్డెన్‌లో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర యువజన నేత మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

బల్దియా..ప్రైవేట్ బాట

మోడల్ మార్కెట్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు.. తాజాగా నాలాలు

ఆర్థిక కారణాలు చూపుతూ ప్రైవేట్‌పరం చేస్తున్న జీహెచ్ఎంసీ

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేసే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడం...అప్పుల ఊబిలోకి సంస్థ కూరుకుపోతుండడం, నిర్వహణ లోపంతో పౌరులకు మెరుగైన సేవలందించడంలో విఫలమైన అధికారులు ప్రైవేట్ బాట పట్టారు. ఇప్పటికే మోడల్ మార్కెట్లు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ప్రైవేట్ వైపు చూపగా, తాజాగా నాలాలను సైతం ప్రైవేట్ ఏజెన్సీలను అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. గ్రేటర్‌లో వరద ముంపు సమస్య పరిష్కారంలో భాగంగా నాలాల నిర్వహణను ప్రైవేట్ బాధ్యతలు అప్పగించనున్నారు. ఈ మేరకు జోన్ల వారీగా తీవ్ర ముంపునకు గురవుతున్న ప్రాంతాలు, నిర్వహణ సంక్లిష్టంగా ఉన్న నాలాల వివరాలను కేంద్ర కార్యాలయం సేకరిస్తున్నది. రోడ్డు, ఇతర ప్రాజెక్టుల మాదిరిగా నాలాల నిర్వహణను ప్రైవేట్‌కు అప్పగించనున్నారు. గ్రేటర్‌లో మొత్తం వరద ప్రవాహ వ్యవస్థ 1302 కిలోమీటర్లు ఉండగా, మేజర్‌గా నాలా 370 కిలోమీటర్లు, మైనర్ డ్రైన్స్ 912 కిలోమీటర్లు ఉంది. పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని నాలాలను తొలుత ఎంపిక చేసి ఏడాది కాల వ్యవధికి ఏజెన్సీలకు ఇవ్వనున్నారు. సత్ఫలితాలు వస్తే దశల వారీగా ఇతర నాలాలకు విస్తరించనున్నారు. అయితే ఈ ప్రైవేట్ పేరిట ఏజెన్సీలకు దోచిపెట్టడమే అన్న వాదనలు వినిపిస్తున్నాయి.

ఖరీదు కానున్న ఆటలు

జీహెచ్ఎంసీ పరిధిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) పద్ధతిలోకి తీసుకువస్తున్నారు. ప్రయోగాత్మకంగా ఖైరతాబాద్ జోన్‌లోని అమీర్‌పేట, షేక్‌పేట స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను ఎంపిక చేశారు. ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను మరింత బలోపేతం చేసి ఐదేండ్ల పాటు పీపీపీ పద్ధతిలో నిర్వహణను చేపట్టనున్నారు. ఈ మేరకు ఆసక్తి గల ఏజెన్సీలు ప్రతిపాదనలు సమర్పించాలంటూ ఆర్ఎఫ్‌పీ టెండర్లను ఆహ్వానించారు. ఈ నెల 21న సాయంత్రం సాయంత్రం 5 గంటలకు టెండర్ దాఖలుకు తుది గడువు విధించారు. 28వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలకు టెండర్ తాలుకా దరఖాస్తులను తెరిచి.. అర్హులైన వారిని ఎంపిక చేయనున్నారు. సదరు టెండర్ దక్కించుకున్న ఏజెన్సీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేసి ఐదేండ్ల పాటు నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించనున్నది. అన్ని రకాల రుసుంలను ఏటా 5-7శాతం మేర పెంచుకుని ఆ భారాన్ని క్రీడాకారులపై మోపనున్నారు.

లష్కర్‌లో ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట: ప్రశాంతంగా ఉండే నార్త్‌జోన్ పరిధిలో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలు ఎంతో బాధను కలిగిస్తున్నాయని, ప్రశాంత వాతావరణం కోసం సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ముత్యాలమ్మ దేవాలయ పరిధిలోని బస్తీవాసులు, ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మ విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేసి వారం రోజులు కావొస్తున్నా.. ఆందోళనలు, నిరసనలతో ఆ ప్రాంతమంతా భయానక వాతావరణాన్ని తలపిస్తున్నదన్నారు. ఆలయ సంప్రోక్షణకు ఏం చేయాలనే విషయాలపై మంగళవారం బస్తీ ప్రజలు, ఆలయ కమిటీ, పండితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు రూప, శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదు

సిటీబ్యూరో/మారేడ్‌పల్లి: ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే నుంచి గానీ తాము ఒక్క రూపాయి కూడా తీసుకోలేదని, కొందరు తప్పుడు ఆరోపణలు చేయడం తగదని ముత్యాలమ్మ ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నారు. ఆదివారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ సభ్యులు సంతోష్, కిరణ్, సాయిప్రకాశ్, కిషన్, ఎల్లేశ్, వైష్ణవి, సోను మాట్లాడారు. ఈ నెల 19న మినిస్టర్ క్వార్టర్స్ లో ఎమ్మెల్యే శ్రీ గణేశ్ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిశామని, గుడి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.10 లక్షలు, ప్రభుత్వం తరపున రూ. 10 లక్షలు అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారని చెప్పారు. ఈ విషయాన్ని ఆలయం వద్దకు వచ్చి ముందే చెప్పామని, అందరి సమక్షంలో నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు వివరించారు. ఇప్పటి వరకు ఎవరి వద్ద నుంచి ఒక్క రూపాయి కూడా డబ్బులు తీసుకోలేదని...ఆలయ కమిటీ పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

ఆలయం పరిసరాల్లో గట్టి బందోబస్తు

కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ ఆలయం పరిసర ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. శనివారం హిందూ ధార్మిక సంఘాల ఇచ్చిన సికింద్రాబాద్ బంద్ సందర్భంగా వేలాది మంది హిందువులు, బీజేపీ నాయకులు ఆలయ వద్ద చేరుకోవడంతో పరిస్థితి తీవ్ర ఉద్రిక్తతగా మారడంతో పోలీసులు లాఠీ చార్జి చేశారు. ఈ నేపథ్యంలో ముత్యాలమ్మ ఆలయానికి వెళ్లే దారుల్లో పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. బయటి వ్యక్తులను ఎవరినీ కూడా ఆలయం వైపు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. స్థానికులను మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు.

అంధకారంలో ఔటర్

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ):హైదరాబాద్ మహానగరానికి మణిహారంలా ఉన్న ఔటర్ రింగు రోడ్డుపై అంధకారం అలముకున్నది. రాత్రి వేళల్లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు వీధి దీపాలు ఎంతో ముఖ్యం. ఇందుకోసం వందల కోట్ల రూపాయలు వెచ్చించి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) వీధి దీపాలను 158 కి.మీ పొడవునా ఏర్పాటు చేసింది. అయితే నిర్వహణ లోపం కారణంగా అవి రాత్రి పూట వెలగడం లేదు. అసలే ఔటర్‌పై తరచూ ప్రమాదాలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఔటర్ నిర్వహణను సరిగా చేయకపోవడం వల్లే రాత్రి వేళల్లో ప్రధాన రహదారిపై పూర్తి స్థాయిలో దీపాలు వెలగడం లేదని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లోనే ఔటర్‌పై ఎక్కువగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అలాంటి సమయంలో వీధి దీపాలు వెలగకపోతే ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని, ఇప్పటికైనా అధికారులు దీనిపై ప్రధానంగా దృష్టి సారించి ఓఆర్ఆర్ నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండో దశ.. నిధులెట్లా..?

రూ.24వేల కోట్ల వ్యయంతో మెట్రో ఫేస్-2

కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా సహకరించడంపై సందిగ్ధం

సిటీబ్యూరో: నగరంలో మొదటి దశ మెట్రోను పూర్తిగా పీపీపీ విధానంలో నిర్మిస్తే, రెండో దశను పూర్తిగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలే నిధులను సమకూరాల్సిన పరిస్థితి నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రకరకాలుగా మార్చిన తర్వాత రెండోదశ మెట్రో రైలు మార్గాల ప్రతిపాదనలకు సంబంధించిన డీపీఆర్‌లను ఎట్టకేలకు సిద్ధం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి, కేంద్రానికి పంపితే అక్కడ ఆమోదం ముద్ర పొందడమే తరువాయి అన్నట్లుగా ఉంది. అయితే రెండో దశలో నిర్మించాలని నిర్ణయించిన 76.2 కి.మీ మార్గానికి సుమారు రూ.24237 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. రెండో దశలో ప్రతిపాదించిన 5 మెట్రో మార్గాలను ముందుగా నిర్మించాలని నిర్ణయించిన నేపథ్యంలో నిధులు ఎలా సమకూర్చుకోవాలన్న దానిపై హైదరాబాద్ మెట్రో అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు నిర్ణయించిన ప్రకారం రెండో దశ మెట్రో ప్రాజెక్టులో కేంద్ర ప్రభుత్వం 15శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం భరిస్తే, మిగతా 50 శాతంలో 45 శాతం రుణాల ద్వారా, మరో 5 శాతం వ్యయాన్ని పీపీపీ విధానంలో సమకూర్చుకునేలా రెండో దశ మెట్రో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా కేంద్ర ప్రభుత్వం అనుమతులు రావడం ఒక్క ఎత్తయితే.... దానికి అవసరమైన బడ్జెట్ కేటాయింపు ఎప్పటి వరకు ఇస్తారో చెప్పలేని పరిస్థితి. ఇప్పటికే రెండో దశను 2029 నాటికి పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నా బడ్జెట్ కేటాయింపులే అత్యంత కీలకంగా మారనున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై పది నెలలు గడుస్తున్నా, మెట్రో ప్రాజెక్టు పరంగా పెద్దగా పురోగతి లేదు. 7-8 నెలలుగా కొత్త రూట్లు,వాటికి అనుగుణంగా డీపీఆర్‌లను రూపొందించడానికి చాలా ఎక్కువ సమయం తీసుకున్నారు. ఇక ప్రస్తుతం రెండో దశ మెట్రో పరుగులు పెట్టాలంటే కేంద్ర ప్రభుత్వం తీసుకునే చొరవ మీద ఆధారపడి ఉంటుందని మెట్రో అధికారి ఒకరు చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కొరత....

రెండో దశ మెట్రో ప్రాజెక్టును చేపట్టేందుకు డీపీఆర్‌లో పొందుపర్చిన అంచనా ప్రకారం రూ.24237 కోట్ల వ్యయం అవుతుంది. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 35 శాతం భరించాలంటే సుమారు రూ.9210 కోట్లను నేరుగా వెచ్చించాల్సి ఉండగా, కేంద్రం 15 శాతం వాటాగా 3635 కోట్లను రెండో దశ మెట్రో కోసం కేటాయించాల్సి ఉంటుంది. ఇక మిగిలిన నిధుల కోసం కేంద్ర ప్రభుత్వమే గ్యారెంటీర్‌గా ఉండి దేశ, విదేశీ బ్యాంకుల ద్వారా నిధులను సకాలంలో ఇప్పించగలిగితేనే మెట్రో ప్రాజెక్టు పనులు మొదలయ్యే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఎక్కడ కొర్రీ పెట్టినా ప్రాజెక్టు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండే పరిస్థితి. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇచ్చి, నిధుల పరంగా సహకరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ఆ స్థాయిలో మెట్రో కోసం నిధులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

నిఘా నేత్రం..నామమాత్రం

చాలా చోట్ల పనిచేయని సీసీ కెమెరాలు

- 'నేను సైతం' పేరిట గతంలో 5 లక్షలకు పైగా కెమెరాల బిగింపు
- ప్రపంచంలోనే అత్యధికంగా 'సీసీ'లు ఉన్న రెండో నగరంగా గుర్తింపు
- నిర్వహణ లోపంతో దెబ్బతిన్న అనేక కెమెరాలు
- కేసుల ఛేదనలో తలెత్తుతున్న ఇబ్బందులు

సిటీబ్యూరో, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో సీసీ కెమెరాల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. చీమ చిటుక్కుమన్నా తెలిసే విధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్షలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి... ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టారు. 'కమ్యూనిటీ', 'నేను సైతం' పేరిట లక్షలాది సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, అవి హైదరాబాద్‌లో శాంతి భద్రతల పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషిస్తూ వచ్చాయి. వెయ్యి మంది ప్రజలకు 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు చదరపు కిలోమీటర్‌కు 480 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి లండన్, బీజింగ్, న్యూయార్క్ నగరాలను అధిగమించిన సిటీగా హైదరాబాద్ ప్రపంచంలోనే రెండో స్థానాన్ని సంపాదించింది. ఇప్పుడు కొత్త సీసీ కెమెరాల ఏర్పాటు కాదు కదా.. ఉన్నవాటిలో ఎన్ని పనిచేస్తున్నాయి..? ఎన్ని పనిచేయడం లేదు అనేది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో హైదరాబాద్ పోలీసులు సీసీ కెమెరాల నిర్వహణకు ప్రజల సహకారాన్ని కోరుతున్నారు.

'నేను సైతం' ద్వారా 5 లక్షలకుపైగా..

హైదరాబాద్‌లో 5 లక్షలకుపైగా సీసీ కెమెరాలు 'నేను సైతం' స్కీంలో ప్రజల సహకారంతో ఏర్పాటు చేశారు. దీంతో పాటు 10 వేల కమ్యూనిటీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇందులో 'నేను సైతం' కెమెరాలు చాలా వరకు పనిచేయడం లేదు. 2015 తరువాత అప్పటి ప్రభుత్వ హయాంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తూ..వారిని భాగస్వాములను చేసి నేను సైతం పేరుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా సీసీ కెమెరాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. అయితే ఎలక్ట్రానిక్ వస్తువులు కావడంతో చాలా వరకు సీసీ కెమెరాలు, వాటి కేబుళ్లు పనిచేయడం లేదు. వర్షానికి నానుతూ, ఎండకు ఎండుతూ ఇలా రోడ్డు వైపులకు ఉన్న కెమెరాలు చాలా వరకు దెబ్బతిన్నాయి. కొందరు ఇంటి యజమానులు వాటికి మరమ్మతులు చేయించుకోవడం, మరికొందరు వాటి స్థానంలో లెటెస్ట్ టెక్నాలజీకి సంబంధించిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు.

దర్యాప్తు మందగమనం..

హైదరాబాద్‌లో నేరం జరుగొద్దు... జరిగితే 24 గంటల్లో నిందితులను పట్టుకోవాలనే లక్ష్యంతో గత పదేండ్లు పోలీసులు పనిచేశారు. అందుకు తగ్గట్టుగా టెక్నాలజీని వాడుకున్నారు. గతంలో వాడిన టెక్నాలజీని మెమెందుకు వాడాలి..ఆ సంస్కరణలు మేం ఎందుకు కొనసాగించాలనే కోణంతో కొందరు అధికారుల ఆలోచన తీరు ఉండటంతో ప్రస్తుతం చాలా వరకు టెక్నాలజీకి సంబంధించిన అంశాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేదు. ఈ క్రమంలోనే నేరం జరిగితే ముందుగా పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీలను సేకరించి నిందితుడిని పట్టుకునే ప్రయత్నం చేస్తుంటారు. ప్రస్తుతం సీసీ కెమెరాలు సరిగా పనిచేయకపోవడంతో ఫుటేజీలను గుర్తించడానికి, గుర్తించిన దానిని విశ్లేషించేందుకు కూడా సమయం పడుతున్నది. దీంతోనే కేసుల ఛేదనలో సమయం పడుతున్నదనే వాదన వినిపిస్తున్నది.

ప్రజల మద్దతు కావాలి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించడంతో పాటు నిర్వహణ కూడా కీలకమైన అంశమే. ఈ నేపథ్యంలో కాలం గడుస్తుండడంతో నేను సైతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిర్వహణ ఆయా యాజమాన్యాలు కొన్ని సందర్భాల్లో పట్టించుకోకపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇప్పుడు ఈ కెమెరాలను సరిగ్గా పనిచేసే విధంగా చేయడంలో ప్రజల మద్దతు కోరుతున్నామని నగర పోలీసు బాస్ ఇటీవల ట్వీట్ ద్వారా కోరారు. నగరంలో 10 వేల కమ్యూనిటీ, 5 లక్షల సీసీ కెమెరాలు ప్రజల సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు మరోసారి డ్రైవ్ చేయాల్సి ఉన్నది. అందుకు ప్రజల మద్దతు కావాలని ఆయన కోరారు.

ఇండ్లను కూల్చాలంటే మమ్మల్ని దాటి వెళ్లాలి

మూసీ నిర్వాసితులకు అండగా ఉంటాం -ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: మూసీ పరీవాహక ప్రాంతంలోని ఇండ్లను కూల్చాలంటే తమను దాటి వెళ్లాలని, ప్రజలకు అండగా ఉంటామని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తపేట డివిజన్‌లోని జనప్రియ అపార్టమెంట్ సముదాయంలో, చైతన్యపురి డివిజన్ సత్యనగర్ కాలనీలో నిర్వహించిన సమావేశాల్లో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూసీ పరీవాహకంలోని ప్రజలెవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తాను ఎల్లవేళలా అందుబాటులోని ఉంటానని, ప్రజలకు ఎలాంటి హానీ జరుగనివ్వబోమన్నారు. ఒకప్పుడు ఇక్కడి ప్రజలు మూసీ నీరు తాగేవారని, అంత స్వచ్ఛంగా నీరు ఉండేదన్నారు. మూసీ నది రానురాను మురికికూపంగా మారిందని, తాను ఎంఆర్‌డీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే మూసీ ప్రక్షాళన ప్రారంభించానని చెప్పారు. మూసీ నీటిని శుద్ధి చేసేందుకు 32 ఎస్‌టీపీలను ప్రారంభించామని, వాటిలో కొన్ని పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రజలను ఇబ్బందులు పెడతామంటే, ప్రజల జీవితాలతో చెలగాటమాడుతామంటే తాము ఒప్పుకోమని సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. ప్రజలకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

జీవో వచ్చినా.. అమలేదీ?

- నీటి బకాయిదారులకు ఓటీఎస్‌ను తీసుకొచ్చిన సర్కారు
- ఉత్తర్వులు వెలువడి 16 రోజులైనా.. అమలు చేయడంలో తాత్సారం
- మరో 10 రోజుల్లో ముగియనున్న గడువు
- అర్హుల ఎంపిక పేరిట కాలయాపన చేస్తున్న అధికారులు
- ఇద్దరు ఐఏఎస్‌లు, సీనియర్ డైరెక్టర్లు ఉన్నా.. అర్హులకు తప్పని ఎదురుచూపులు

సిటీబ్యూరో: దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న నీటి బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం ఓటీఎస్ (వన్ టైం సెటిల్‌మెంట్) అవకాశాన్ని కల్పిస్తూ ఈ నెల 4న పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. 31లోగా నీటి బకాయిదారులందరూ నీటి బిల్లుపై ఎలాంటి అలస్య రుసుం, వడ్డీ లేకుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్కారు సూచించింది. అయితే ఉత్తర్వులు వెలువడి 16 రోజులైనా..ఓటీఎస్ అమలు కాలేదు. డివిజన్ల వారీగా ఓటీఎస్ లబ్ధిదారులను ప్రత్యేకంగా గుర్తించి, ప్రత్యేక యాప్ విధానాన్ని తీసుకువస్తున్నామని చెబుతూ.. రెండు వారాలు దాటినా సాంకేతిక సమస్యలను అధిగమించడం లేదు. ఇంకో పది రోజుల్లో ఓటీఎస్‌కు ఇచ్చిన గడువు ముగిస్తున్నది. సంస్థలో ఇద్దరు ఐఏఎస్‌లు, సీనియర్ డైరెక్టర్లు ఉన్నా అర్హులకు ఎదురుచూపులు తప్పడం లేదు. రెవెన్యూ విభాగం అధికారులు మాత్రం ఓటీఎస్ విధానం అమల్లో జరుగుతున్న మార్పులతో ఆలస్యమైందని, సోమవారం (నేటి) నుంచి అర్హులైన వినియోగదారులందరికీ ఎస్ఎంఎస్‌లు వెళ్తాయని చెబుతున్నారు.

లక్ష్యం.. ₹1255 కోట్లు

మొత్తం 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తించనుంది. రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉండగా, ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానుంది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా ఓటీఎస్‌ను డివిజన్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. అయితే ఓటీఎస్ ఆలస్యానికి ప్రధాన కారణం గతంలో ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారుల గుర్తించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఈ స్కీంలో గతంలో లబ్ధిపొందిన వారికి ఈ సారి 50 శాతం వరకు బిల్లు మాఫీ అవుతుంది.

నిబంధనలు తప్పనిసరి

గతంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు ఒకేసారి బిల్లు చెల్లిస్తే ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ అవుతాయి. ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని అఫిడవిట్ రాసివ్వాలి. నల్లా కనెక్షన్ యాక్టివ్‌లో ఉన్న వారు మాత్రమే అర్హులు. మేనేజర్ స్థాయిలో రూ. 2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10వేలు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ. లక్ష వరకు , చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ మాఫీ చేసే అధికారం ఉంది.

ప్రభుత్వ బకాయిల మాటేమిటీ?

వివిధ ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలు పేరుకుపోయాయి. దాదాపు 40 సంస్థల నుంచి రూ.1660కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉంది. వైద్య ఆరోగ్య శాఖ రూ.56.30 కోట్లు, హౌసింగ్ రూ.33కోట్లు, ఇరిగేషన్ రూ.21కోట్లు , పంచాయతీ రాజ్ రూ.37కోట్లు, మిషన్ భగీరథ రూ. 82కోట్లు, పురపాలక శాఖ రూ.26 కోట్లు, సాధారణ పరిపాలన రూ.12కోట్లు, హోం శాఖ రూ. 27కోట్లు తదితర శాఖలు నీటి బిల్లులు చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలపై జలమండలి మీనమేషాలు లెక్కిస్తుండడం గమనార్హం.